క్లుప్తంగా

ఆర్థిక సాయం



రుద్రూర్: మండల కేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరు బాధితులకు గురువారం కోనేరు శశాంక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. రుద్రూర్ చెందిన ఎముల సాయిలు రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నాడు, మరో యువకుడు ధర్మారం వెంకటేష్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. వీరికి తక్షణ సహాయంగా రూ.5 వేల నగదు, ప్రతి నెలా మందుల కొనుగోలుకు ట్రస్ట్ ద్వారా సహకారం అందించనున్నట్లు ట్రస్ట్ సభ్యులు తరుణ్‌సాయితేజ భరోసా కల్పించారు. బీజేపీ నాయకులు ఆలపాటి హరికృష్ణ, ప్రశాంత్ గౌడ్, కుమ్మరి గణేష్, ఎముల గజేందర్,శివప్రసాద్,గంగాధర్, వినోద్ ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



రెంజల్(బోధన్): సాటాపూర్‌లో శ్రీరామాలయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం భక్తి శ్రద్ధలతో కొనసాగుతుంది. గురువారం విగ్రహ మూర్తులకు వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కందకుర్తి త్రివేణి సంగమ పుష్కర క్షేత్రంలోని సీతారాం త్యాగి మహారాజ్ పాల్గొని ఆలయాలు హైందవ సంస్కృతికి నిలయాలని పేర్కొన్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

రెంజర్ల పాఠశాలకు అవార్డు



బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రాష్ట్ర స్థాయిలో గ్రీన్ చాంపియన్ ద్వితీయ పురస్కారం అందుకుంది. గత విద్యా సంవత్సరం చేపట్టిన వివిధ పర్యావరణ స్నేహపూర్వక కృత్యాలను గుర్తించి ఈ అవార్డును అందించినట్లు ఎంఈవో జక్కుల రవికుమార్ తెలిపారు. గురువారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో అటవీశాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా పాఠశాల జీవ శాస్త్ర ఉపాధ్యాయుడు మల్లేష్ ఈ అవార్డును అందుకున్నాడు. ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదిమ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన మహిళలు

మోర్తాడ్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా భీమ్‌గల్ మున్సిపల్ పరిధిలోని రాతం చెరువు వద్ద మహిళా సంఘాల సభ్యుల సహకారంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కమిషనర్ గోపు గంగాధర్ మాట్లాడుతూ.. భీంగల్‌ని ఆదర్శవంతమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఎస్సై మహేష్, మున్సిపల్ మేనేజర్ నరేందర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



మాక్లూర్: రామచంద్రపల్లి గ్రామంలో గురువారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక బీజేపీ నాయకుడు తాడు మహేష్ లబ్ధిదారులకు అందజేశారు. స్థానిక బీజేపీ నాయకులు గంగాధర్, సతీష్, బుర్ర వినోద్, భరత్, రాజలింగం, ప్రణీత్, భూషణ్ పాల్గొన్నారు.

డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభం

మాక్లూర్: మండలంలోని దాస్‌నగర్ వద్ద గల తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ లావణ్య గురువారం తెలిపారు. ఈ అడ్మిషన్ల ప్రక్రియ ఈనెల 23 వరకు కొనసాగుతుందన్నారు. ఇంటర్ పాసయిన మహిళ విద్యార్థులు తగిన పత్రాలతో వచ్చి అడ్మిషన్లు తీసుకోవచ్చునన్నారు.

పునాదులు దాటని స్త్రీ శక్తి భవనం

- చెట్ల కింద, అద్దె భవనాల్లో మహిళా సంఘాల సమావేశాలు
- రూ.25 లక్షల అంచనాతో 2015లో పనులు ప్రారంభం
- ఇప్పటికీ పూర్తి కాని పనులు



పునాదుల దశలో నిలిచిపోయిన స్త్రీశక్తి భవన నిర్మాణం

ఆర్మూర్‌టౌన్ : పట్టణంలో నిర్మాణంలో ఉన్న స్త్రీ శక్తి భవనానికి గ్రహణం పట్టుకుంది. 35వ వార్డు(పాత 19వ వార్డు)లో స్త్రీశక్తి భవనం నిర్మాణానికి 2015లో అప్పటి ఎంపీ కవిత చేతుల మీదుగా భవనానికి భూమి పూజ చేశారు. కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే వదిలేశాడు. ఆ తరువాత మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సైతం మళ్లీ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఆయన హయాంలో ఆ భవనం పనులు పునాదుల వరకు వచ్చి నిలిచిపోయాయి. సుమారు రూ.25 లక్షల వ్యయం అంచనాతో పనులు ప్రారంభించారు. కాని స్త్రీ శక్తి భవనం పూర్తి కాలేదు. ఆర్మూర్‌లో మొత్తం వెయ్యి మహిళా సంఘాలు, సుమారు 10 వేల మంది సభ్యులు ఉన్నారు. ఆర్పీలు, సమాఖ్య అధ్యక్షులు మహిళ సంఘాలతో సమావేశాలు నిర్వహిస్తారు. కాని స్త్రీశక్తి భవనం లేకపోవడంతో చెట్ల కింద, అద్దె భవనాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా స్త్రీశక్తి భవనం నిర్మాణం పూర్తి చేయాలని మహిళ సంఘాల సభ్యులు కోరుతున్నారు. సీఆర్‌సీ భవన నిర్మాణానికి ఎవరు కూడా ముందుకు రావడం లేదు. ఏ కాంట్రాక్టర్ సైతం ఈ భవన నిర్మాణానికి టెండర్ వేయడం లేదు. పునాదులు సైతం పూర్తిగా దెబ్బతిన్నాయి.



చెట్లకింద సమావేశమైన మహిళా సంఘాలు

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

నిలిచిపోయిన సీఆర్‌సీ భవనం నిర్మాణ విషయమై టీఎల్ఎఫ్ తరపున ఉన్నతాధికారులను కోరుతాం. సీఆర్‌సీ భవనం పూర్తయితే మహిళ సంఘాల సమావేశాలు అందులోనే నిర్వహిస్తాం.

– ఉదయ్‌శ్రీ, కో–ఆర్డినేటర్, టౌన్ మిషన్ ఆర్మూర్



శిలాఫలకం దుస్థితి,

భావితరాలకు మంచి వాతావరణం అందించాలి



కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నేత వినయ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజు తదితరులు

ఆర్మూర్‌టౌన్: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ డిగ్రీకళాశాల సమీపంలో గల పట్టణ ప్రకృతి వనంలో వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భావితరాలకు మంచి వాతారవణం అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. 100 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో ఆర్మూర్‌ను అభివృద్ధి చేయడం లక్ష్యంగా పనిచేస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ రాజు, మార్కెట్ యార్డు చైర్మన్ సాయిబాబాగౌడ్, నాయకులు పండిత్‌ప్రేమ్, మున్నుబాయ్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో చెట్ల పాత్ర కీలకం



అంకాపూర్‌లో మొక్కలు నాటుతున్న ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి

ఆర్మూర్: పర్యావరణ పరిరక్షణలో చెట్ల పాత్ర కీలకమని ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గంగాదేవి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటిన అనంతరం ఆయన మాట్లాడారు. యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు వినోద్‌రెడ్డి, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు పట్వారి గోపికృష్ణ, సామాజిక సేవకుడు పట్వారి తులసి, గురడి రెడ్డి సంఘం అధ్యక్షుడు చిన్న అనంతు, సభ్యులు పాల్గొన్నారు.

నేడు కరెంట్ సరఫరాలో అంతరాయం

రెంజల్(బోధన్): రెంజల్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం నాలుగు ఫీడర్ల పరిధిలో కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మగ్దుం అలీ తెలిపారు. వీరన్నగుట్ట ఏజీఎల్‌తో పాటు గ్రామానికి, బాగేపల్లి, దూపల్లి, ఓల్డ్ బాగేపల్లి గ్రామాలకు కరెంట్ సరఫరా ఉండదన్నారు.

ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ నిలిపి వేస్తున్నట్లు వివరించారు.

ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలి



ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది

ఆర్మూర్‌టౌన్: మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్మూర్ కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంటింటా మొక్కలు నాటుదాం.. ఊరంతా పచ్చదనం నింపుదామన్నారు. మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించుకోవాలన్నారు. మండల న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా ర్యాలీ నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి సరళి, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గంగాధర్, బార్ అసోసియేషన్ శ్రీధర్, ప్రధాన కార్యదర్శి జెస్సు అనిల్, పీపీ ఖాందేష్ శ్రీనివాస్, వైస్ ఉపాధ్యక్షుడు ఆనంద్, చిలక కిష్టయ్య, లోక భూపతిరెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయండి



కలెక్టర్‌కు సమస్య విన్నవిస్తున్న కాంగ్రెస్ నేత రమేశ్

బోధన్: పట్టణ కేంద్రం శివారు నుంచి మహారాష్ట్ర వైపు వెళ్లే మార్గంలో సాలూర అంతర్రాష్ట చెక్‌పోస్టు వరకు రోడ్డు(8.3 కి.మీ) నిర్మాణ పనులు పూర్తి చేశారు. బోధన్, సాలూర మండలాల్లోని నాగన్‌పల్లి, సాలూరక్యాంప్, సాలూర గ్రామాల శివారులో పంట పొలాల మధ్య బైపాస్ రోడ్డు నిర్మించారు. బైపాస్ రోడ్డులో ఆయా గ్రామాల క్రాసింగ్‌ల వద్ద, పంట కాలువల కల్వర్టుల వద్ద ఇరువైపులా ఏర్పడిన భారీ గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ రోడ్డు నిర్వహణ, పర్యవేక్షణ నేషనల్ హైవే అథారిటీ శాఖ చూస్తోంది. గురువారం సాలూరలో జరిగిన గ్రామ రెవెన్యూ సదస్సు పరిశీలనకు వచ్చిన జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును ఇదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేత అల్లె రమేష్ కలిసి సమస్యను వివరించారు. కొత్తగా నిర్మించిన రోడ్డులో ప్రమాదకర పరిస్థితుల గురించి వివరించారు. ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మహిళలు పారిశ్రామిక రంగంలోకి రావాలి



మాట్లాడుతున్న ప్రాజెక్టు ఆఫీసర్ మహమ్మద్ కాశీమ్

ఆర్మూర్: మహిళలు పారిశ్రామిక రంగంలో సైతం రాణించాలని ఏఎల్ఈఏపీ ప్రాజెక్టు ఆఫీసర్ మహమ్మద్ కాశీమ్ ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంత మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రపంచ బ్యాంకు నిధులతో అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్ ఆఫ్ ఇండియా(ఏఎల్ఈఏపీ) ఆధ్వర్యంలో ర్యాంప్ రైసింగ్ అండ్ యాక్సలరేటింగ్ పెర్ఫార్మెన్స్‌లో భాగంగా ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమల శాఖ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థల సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఔత్సాహిక మహిళలకు 15 రోజుల పాటు పరిశ్రమల నిర్వహణ, ఉత్పత్తుల మార్కెటింగ్ మెలకువలతో పాటు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తామన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు రిజిస్ట్రేషన్, బ్యాంకుల ద్వారా రుణ సహాయం కూడా ఇప్పిస్తామన్నారు. ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ అనిల్, ఆర్మూర్, బాల్కొండ ఏపీఎంలు గంగారాం, గంగాధర్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అడ్మిషన్ల సంఖ్య పెరగడానికి చేయూత ఇవ్వండి



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు

మోర్తాడ్(బాల్కొండ): బడిబాటకు ముందే అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతం చేయడంలో సుంకెట్ ఉన్నత పాఠశాల హెచ్ఎం సంతోష్‌కుమార్ ముందడుగు వేశారు. మహిళలు చొరవ తీసుకుంటేనే ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెరగడానికి అవకాశం ఉందని భావించిన ఆయన మహిళా సంఘాల సభ్యులతో సమావేశాలను నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. ఇప్పుడు పాఠశాలలో 94 మంది విద్యార్థులు ఉన్నారని కనీసం 150 మంది విద్యార్థులకు సంఖ్య పెరగాలని మహిళలకు వివరించారు. 13 ఏళ్ల నుంచి తమ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారని వివరించారు. మహిళలు అనుకుంటేనే ప్రభుత్వ పాఠశాలల మనుగడ సాధ్యమైన ఆయన భావించి సమావేశం నిర్వహించినట్లు 'సాక్షి'తో చెప్పారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



బోధన్ సబ్ కలెక్టర్ ఆఫీస్ ఆవరణలో మొక్కలు నాటి నీళ్లు పోస్తున్న సబ్ కలెక్టర్ వికాస్ మహతో



వర్నిలో ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ శాఖాధికారులు



కమ్మర్‌పల్లిలో మొక్కలు నాటుతున్న అధికారులు

బోధన్: భావితరాల భవిష్యత్తు కోసం పర్యావరణ పరిరక్షణ కార్యం అందరి బాధ్యతని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పట్టణ కేంద్రంలోని తన ఆఫీస్ ఆవరణలో సబ్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, అధికారులతో కలిసి మొక్కలు నాటారు. బోధన్‌ను హరిత పట్టణంగా తీర్చిదిద్దాలన్నారు.

వర్ని: ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని, అడవులను సంరక్షించాలని వర్ని అటవీ రేంజ్ ఆఫీసర్ గంగాధర్ సూచించారు. గురువారం వర్ని మండల కేంద్రంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ, ప్లాస్టిక్ వస్తువుల సేకరణ, మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నాగేశ్వర్, బీట్ ఆఫీసర్ రమేష్ రెడ్డి, వర్ని ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు గోపాల్, పంచాయతీ కార్యదర్శి సాయిలు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిదని కమ్మర్‌పల్లి అటవీ క్షేత్ర పరిధి కార్యాలయం అధికారి రవీందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని క్షేత్ర పరిధి కార్యాలయంలో మొక్కలు నాటారు. ఏఎంసీ చైర్మన్ నర్సయ్య, వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, సుంకెట రవి తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త వేరు చేసి అందించాలి



ఆర్మూర్‌టౌన్: తడి, పొడి చెత్తను వేరు చేసి అందించాలని మున్సిపల్ కమిషనర్ రాజు..ప్రజలకు సూచించారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మున్సిపల్ ఆధ్వర్యంలో పెర్కిట్ మహిళా సమాఖ్య భవనం నుంచి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ని ర్వహించారు. సానిటరీ ఎస్సై గజానంద్, సీనియర్ అసిస్టెంట్ శేఖర్ పాల్గొన్నారు.

స్వర్గరథం ప్రారంభం



వేల్పూర్: అక్లూర్‌కు పెర్కిట్‌కు చెందిన ఓదెల రాజేశ్, ఓదెల రాకేశ్ సోదరులు వితరణ చేసిన స్వర్గరథాన్ని ఆర్మూర్ ఆర్డీవో పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. ఓదెల సత్యనారాయణగౌడ్, ఓదెల సునీత స్మారకార్థం వారు స్వర్గరథం వితరణ చేశారు. వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అద్దె భవనాల్లో అంగన్‌వాడీలు



నందిపేటలో అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

- ఇబ్బందులు పడుతున్న సిబ్బంది
- కేంద్రాల్లో కానరాని సౌకర్యాలు
- సొంత భవనాలు నిర్మించాలని వినతి

నందిపేట్(ఆర్మూర్) : చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అందించే అంగన్‌వాడీ కేంద్రాలకు నందిపేట మండలంలో సొంత భవనాలు కరువయ్యాయి. మండలంలోని వివిధ గ్రామాలలో 75 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. సొంత భవనాలున్నా అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. మెజారిటీ అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటికి ప్రభుత్వం రూ.వెయ్యి అద్దె చెల్లిస్తోంది. అంత తక్కువలో గ్రామాలలో అద్దెకు ఇళ్లు దొరకడం లేదు. అద్దె డబ్బులు కూడ సంవత్సరానికోసారి చెల్లిస్తారు. దీంతో కొన్ని చోట్ల ప్రభుత్వం ఇచ్చే అద్దె డబ్బులు సరిపోక అంగన్‌వాడీ టచర్లే సొంతంగా చెల్లిస్తున్నారు.

ఒకే గదిలో వంట..

పలు చోట్ల అంగన్‌వాడీ కేంద్రాలు ఒకే గదిలో కొనసాగుతున్నాయి. మూత్రశాలలు, మరుగుదొడ్లు, నీటి వసతి వంటి కనీస సౌకర్యాలు లేకుండా ఉన్నాయి. పిల్లలు ఆడుకునేందుకు ఆట ప రికరాలు లేవు. ఒకే గదిలో చిన్నారులకు ప్రాథమిక విద్య బోధించడంతో పాటు అందులోనే వంట చే యడం , సరుకులు పెట్టుకోవడం ఇబ్బందిగా మారింది.

ఇరుకు గదులతో ఇబ్బందులు

ప్రభుత్వం ఇస్తున్న అద్దెకు గ్రామాల్లో ఇళ్లు దొరకడం లేదు. దొరికినా ఒకే గదిలో సరుకులు పెట్టడం, వంట చేయడం ఇబ్బందవుతోంది. ప్రభుత్వం.. భవనాలకు అద్దె పెంచి ప్రతి నెలా ఇస్తే బాగుంటుంది.

– తౌటి మమత, అంగన్‌వాడీ టీచర్, నందిపేట

అద్దె ఇళ్లు మారుతున్నాం

అంగన్‌వాడీలకు సొంత భవనాలు లేకపోవడంతో ఇబ్బందిగా ఉంది. మూత్రశాలలు, నీటి వసతి లేక తరచూ అద్దె ఇళ్లు మారుతున్నాం. ప్రభుత్వం ఇప్పటికైనా సొంత భవనాలు నిర్మించి అన్ని సమస్యలు తీర్చాలి. – సుమలత, అంగన్‌వాడీ టీచర్, నందిపేట

సినిమా

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-3 శ్రీశ్రీశ్రీ రాజావారు-11.45
హౌస్‌ఫుల్-5 (హిందీ)- 2.55, 6.30, 10.00

స్క్రీన్-4 థగ్‌లైఫ్-11.35, 3.00,6.30, 10.00

మాంసం ధరలు (రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	97,500	వెండి(కిలో)	1,03,500
22 క్యారెట్స్	90,002		

– నిజామాబాద్ బిజినెస్

సంక్షిప్తం

పశువులకు వ్యాధి నివారణ టీకాలు

మాక్లూర్: కొత్తపల్లి, వల్లభాపూర్ గ్రామాలలో గురువారం మండల పశు వైద్యాధికారి కిరణ్ దేశ్‌పాండే ఆధ్వర్యంలో పశువులకు టీకాలు వేశారు. వర్షాకాలంలో పశువులు, గొ ర్రెలు, మేకలకు సోకే జబ్బులను దృష్టిలో పెట్టుకొని ముందస్తుగా టీకాలు వేస్తున్నట్లు కిరణ్ తెలిపారు. సిబ్బంది సుధీర్, వినీత, పుష్ప, లక్ష్మీ, గంగాధర్ రైతులు పాల్గొన్నారు.

యజ్ఞాలతో మానవజాతికి మేలు

రుద్రూర్: యజ్ఞాలతో మానవజాతికి మేలు జరుగుతుందని, జీవకోటి మనుగడకు దోహదపడుతుందని పతంజలి యోగ సమితి రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ డాక్టర్ విశ్వనాథ్ మహాజన్ అన్నారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రుద్రూర్ మండల కేంద్రంలోని పతంజలి యోగ సమితి ఆధ్వర్యంలో యజ్ఞం నిర్వహించారు. భారత స్వాభియాన్ ట్రస్ట్ అధ్యక్షుడు కేవీ మోహన్, యువ భారత్ అధ్యక్షుడు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

శెట్‌పల్లిలో రైతులకు అవగాహన సమావేశం

మోర్తాడ్: శెట్‌పల్లిలో రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు సలహాలు, సూచనలు అందించారు. విత్తన కొనుగోళ్లకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సేంద్రియ ఎరువుల వినియోగం గురించి వివరించారు. శాస్త్రవేత్తలు శ్వేత, మహేష్, వ్యవసాయాధికారి హరీష్‌కుమార్, ఏఈవో మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మశాలకు భూమి పూజ

బోధన్ రూరల్ : ఎరాజ్ పల్లి మహాలక్ష్మి మందిరం ఆవరణలో రూ.2.50 లక్షలతో ధర్మశాల నిర్మాణానికి చిన్నోల్ల లింగమ్మ- గిర్థ నర్సారెడ్డి జ్ఞాపకార్థంగా మాజీ సర్పంచ్ ప్రమీల -సంజీవరెడ్డి, వారి కుటుంబసభ్యులు గురువారం గ్రామ పెద్దలతో కలిసి భూమి పూజ చేయించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వసంత్ రెడ్డి, ఎంఈవో నాగయ్య, గ్రామ పెద్దలు కె.సాయిలు, మహారాజ్ గంగారాం, పంచాయతీ కార్యదర్శి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

బాల్కొండ:మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరై న లబ్ధిదారులతో కలిసి గురువారం పంచాయతీ కార్యద ర్శి రజనీకాంత్‌రెడ్డి భూమి పూజ నిర్వహించారు. ఇంది రమ్మ ఇంటి నిర్మాణాలను వేగంగా పూర్తి చేసుకోవాలన్నా రు. ఏఎంసీ డైరెక్టర్ ఇమ్రాన్, నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు

రుద్రూర్: అర్హులందరికి దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లు ప్రభుత్వం మంజూరు చేస్తుందని డీసీసీ డెలిగేట్, కోటగిరి మాజీ ఎంపీటీసీ కొట్టం మనోహర్ అన్నారు. కోటగిరి మండల కేంద్రంలో 26 మంది లబ్ధిదారులకు గురువారం మంజూరు పత్రాలు అందజేశారు. జీపీ కార్యదర్శి ముజఫర్ బేగ్, సింగిల్ విండో చైర్మన్ కూచి సిద్దు, నాయకులు తెళ్ల రవికుమార్, బర్ల మధు తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల వివరాలు నోటీస్ బోర్డులపై ప్రదర్శించాలి



మాట్లాడుతున్న ఎంఈవో నాగయ్య

బోధన్ రూరల్ : ఫీజు వివరాలు ప్రతి పాఠశాలలో నోటీస్ బోర్డులపై ప్రదర్శించాలని బోధన్ ఎంఈవో నాగయ్య సూచించారు. మండలంలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల కరస్పాండెంట్లకు, ప్రధానోపాధ్యాయులకు మండల విద్యావనరుల కేంద్రంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో నాగయ్య మాట్లాడుతూ.. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం పాఠశాలలు నిర్వహించాలని, గుర్తింపు తప్పనిసరిగా ఉండాలని, తప్పనిసరిగా రెన్యూవల్ చేయించుకోవాలని సూచించారు. ప్రి ప్రైమరీ, ఒకటో తరగతిలో చేరే విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ఎంఐఎస్ నాగేష్, సీఆర్‌పీ దేవానంద్, తదితరులున్నారు.